సాక్షి
అనంతపురం
శనివారం, 4, మార్చి, 2023



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.32 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.22, కనిష్ఠం రూ.5, సరాసరి రూ.10 పలికింది.



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

బీటెక్ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జనవరి, ఫిబ్రవరి–2023లో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ http://jntuarerutr.ac.inను సంప్రదించవచ్చు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు



పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డీఏఓ చంద్రానాయక్

పుట్లూరు: ప్రభుత్వ మద్దతు ధరతో రైతు భరోసా కేంద్రాల వద్ద పప్పుశనగ పంటను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం మడ్డిపల్లిలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం పప్పుశనగకు మద్దతు ధర క్వింటాలు రూ.5,335గా నిర్ణయించిందన్నారు. విక్రయించదలచిన రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ చెంగలరాయుడు, వ్యవసాయ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో నూతన ప్రాజెక్టులు

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా నూతన సీడీపీఓ కార్యాలయాలను మంజూరు చేసింది. ఆయా కార్యాలయాలకు సీడీపీఓలను నియమించారు. గ్రేడ్ సూపర్‌వైజర్లకు సీడీపీఓలుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులు కూడా విడుదల చేశారు. ఇప్పటి వరకు ఉన్న కూడేరు ప్రాజెక్టును రద్దు చేసి అనంతపురం రూరల్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తూ కూడేరు సీడీపీఓ ధనలక్ష్మిని నియమించారు. నూతనంగా ఏర్పడిన నార్పల ప్రాజెక్టుకు బుక్కరాయసముద్రం సూపర్‌వైజర్ ధనలక్ష్మికి పదోన్నతి కల్పించి సీడీపీఓగా నియమించారు. అలాగే గ్రేడ్–1 సూపర్‌వైజర్లు అనురాధ (అనంతపురం), పద్మావతి (కంబదూరు), సరస్వతి (బాలసదనం)లకు సీడీపీఓలుగా పదోన్నతి కల్పిస్తూ శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. వీరితో పాటు తాడిపత్రి ఏసీడీపీఓ పద్మావతి, కంబదూరు ఏసీడీపీఓ విజయశ్రీలను చిత్తూరు జిల్లాకు, శింగనమల ఏసీడీపీఓ గీతాంజలిని ఉరవకొండకు బదిలీ చేశారు.

100 శాతం ఈ–క్రాప్

- ఈ–కేవైసీకి నేడు తుది గడువు



అనంతపురం అగ్రికల్చర్: రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదు వంద శాతం పూర్తయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్ శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ఈ – క్రాప్ చేయించుకున్న ప్రతి రైతూ ఈ–కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు వర్తిస్తాయని చెప్పారు. ఈ–కేవైసీ ఇంకా చేయించుకోని రైతులు శనివారం లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలో ఈ–క్రాప్ ఆధారంగా 73,295 మంది రైతులు 2,78,644 ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. అయితే ఇందులో 69,927 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 3,368 మంది రైతులు నేటి సాయంత్రంలోపు ఆర్‌బీకే అసిస్టెంట్లను కలిసి చేయించుకోవాలని సూచించారు. లేదంటే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పంట రుణాల సున్నావడ్డీ లాంటి రాయితీ ప్రోత్సాహక పథకాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

పవర్ ఫుల్

రాష్ట్ర ప్రభుత్వం మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉమ్మడి 'అనంత'లో సోలార్, పవన విద్యుత్ ప్లాంట్ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతోంది. దీనికి అదనంగా మరో మూడు పవర్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి కానుంది.

వేసవిలోనూ మెండుగా కరెంటు

- జిల్లాలో రెండు హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు
- మరో విండ్ పవర్ ప్రాజెక్టు కూడా
- అనుమతులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- ఒక్కో హైడల్ ప్రాజెక్టు నుంచి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- గాలిమరల నుంచి 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ఇప్పటికే చిత్రావతి రిజర్వాయర్ దగ్గర రోడ్డు పనులు మొదలు



శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్ద కోట్ల సమీపంలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద హైడల్ పంప్‌డ్ పవర్ ప్రాజెక్టు పనుల దృశ్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో త్వరలో మూడు పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రెండు హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు కాగా.. మరొకటి విండ్ పవర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఈ ప్రాంతం అత్యంత సానుకూలంగా ఉండటంతో ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయి. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల సమీపంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) వద్ద, శింగనమల నియోజకవర్గంలోని నాయనివారిపల్లె వద్ద హైడల్ పంప్‌డ్ పవర్ ప్రాజెక్టులు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు తాజాగా కేబినెట్ అనుమతులు ఇచ్చింది.

కష్టకాలంలో ఇబ్బందులు లేకుండా..

రాష్ట్రంలో ఎక్కువగా జలవిద్యుత్ ఉత్పత్తి ఉంటుంది. వర్షాకాలం ఉత్పత్తి చేసుకోవచ్చు. కానీ ఎండాకాలం నీటికొరత ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకే హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు చేపడుతున్నారు. దీనికోసం రెండు ప్రాంతాల్లో కృత్రిమ (ఆర్టిఫిషియల్) రిజర్వాయర్లు నిర్మిస్తారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, శింగనమల వద్ద ఉన్న రిజర్వాయర్ నుంచి నీళ్లున్నప్పుడు పైకి నీళ్లు పంప్ చేస్తారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వానికి తక్కువ ధరకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో హైడల్ ప్రాజెక్టు నుంచి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

400 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు

పైన పేర్కొన్న రెండు హైడల్ ప్రాజెక్టులతో పాటు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 400 మెగావాట్ల సామర్థ్యంలో విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకూ కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఇప్పటికే హైడల్ ప్రాజెక్టులకు సంబంధించి రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండేళ్లలోపే ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఒక్కో హైడల్ ప్రాజెక్టుకు రూ.5,600 కోట్ల వ్యయం అవుతుంది. ఈ రెండు హైడల్ ప్రాజెక్టులు పూర్తయితే విద్యుత్ కొరత తీరడంతో పాటు కనీసం రెండు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.



విద్యుత్ కొరత ఉండదు

హైడల్ పంప్‌డ్, విండ్ పవర్ ప్రాజెక్టులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే మండువేసవిలోనూ కరెంటు కొరతను అధిగమించవచ్చు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని అదనంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఇది.

–శివకందర్ నాయక్, డీఈ, నెడ్‌క్యాప్

పెద్ద కోట్ల హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టుకు భూమి	300 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	800 మెగావాట్లు
నాయనివారి పల్లె ప్రాజెక్టుకు భూమి	300 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	800 మెగావాట్లు
కళ్యాణదుర్గంలో విండ్ పవర్‌కు భూమి	400 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	400 మెగావాట్లు
హైడల్ ప్రాజెక్టు వ్యయం	రూ.5600 కోట్లు

మిస్సింగ్ కేసుల్లో పురోగతి సాధించండి



జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అదృశ్యం (మిస్సింగ్) కేసుల్లో పురోగతి సాధించాలని ఎస్పీ ఫక్కీరప్ప పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎస్‌ఐ, ఆపైస్థాయి అధికారులతో ఆయన శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న అమ్మాయిలు, అబ్బాయిలు, మహిళలు, వృద్ధులు, చిన్నారుల మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. కేసుల ఛేదింపునకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా పోలీసుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. అదృశ్యమైన వ్యక్తుల ఫొటోలు తెప్పించి సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయించాలన్నారు. దీంతోపాటు ఫిర్యాదిదారులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో మాట్లాడి దర్యాప్తునకు ఉపయోగపడే సమాచారం సేకరించాలన్నారు. తాజాగా నమోదు చేసిన మిస్సింగ్ కేసుల ఛేదింపునకు ఎలా కృషి చేస్తామో అదే తరహాలో పెండింగ్ కేసుల ఛేదింపునకు కూడా కృషి చేయాలన్నారు.

96 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు

రాప్తాడు రూరల్/ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 96 కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగాయి. అనంతపురం జిల్లాలో 55, శ్రీసత్యసాయి జిల్లాలో 30 కేంద్రాలు కేటాయించారు. రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షల్లో 2,678 మందికి గాను 2,612 మంది విద్యార్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 2,028 మందికి గాను 1,992 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించి అనంతపురం జిల్లాలో 7, శ్రీసత్యసాయి జిల్లాలో 4 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 520 మందికి గాను 490 మంది విద్యార్థులు, మధ్యాహ్నం 508 మందికి గాను 487 మంది హాజరయ్యారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

- లేకపోతే రూ.1000 వరకూ జరిమానా
- త్వరలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్

అనంతపురం సెంట్రల్: వాహనాల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ఏర్పాటు తప్పనిసరి చేసిందని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) శివరామప్రసాద్ తెలిపారు. శుక్రవారం రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 6 లక్షల పైచిలుకు వాహనాలున్నాయని, వాటికి హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు బిగించుకోవాలని ఆదేశించారు. గతంలోనే ఆదేశాలు జారీ చేసినప్పటికీ పది శాతం మంది మాత్రమే ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఇకపై హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేయడంతో పాటు రూ.1000 వరకూ జరిమానా విధిస్తామని తెలిపారు. త్వరలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోండి

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల కోసం aprtacitizen.eprafathi.orfవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీటీసీ సూచించారు. ద్విచక్రవాహనాలకు రూ.245, మూడుచక్రాల వాహనదారులకు రూ.282, లైట్ మోటర్ వెహికల్స్‌కు రూ.619, భారీ వాహనాలకు రూ.649 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అవసరమైతే ఇళ్ల వద్దకే వచ్చి ఏర్పాటు చేస్తారని, ఇందుకోసం అదనంగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఉపయోగాలెన్నో...

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ద్వారా వాహనదారులకు అనేక ఉపయోగాలుంటాయని డీటీసీ శివరామప్రసాద్ తెలిపారు. వాహనాలు చోరీకి గురైన సమయంలో వెంటనే రికవరీ చేయడానికి, టోల్ ఫీజులు చెల్లించడానికి ఈ ప్లేట్లకు అమర్చే చిన్నపాటి యూనిక్ నంబర్ అవసరమవుతుందని వివరించారు. ఈ ప్లేట్‌స్థానంలో నకిలీవి తయారు చేసే అవకాశముండదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, రవాణా శాఖ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని డీటీసీ విజ్ఞప్తి చేశారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్ (రేడియం స్టిక్కర్స్)లు ప్రతి వాహనానికీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఐరాడ్ యాప్‌లో ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు ఈ స్టిక్కర్లు లేకపోవడం వల్లే జరుగుతున్నట్లు తేలిందన్నారు. జాతీయ రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలను పార్కింగ్ చేయడం ద్వారా రాత్రి సమయంలో ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతిక నాజ్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే





మంగళసూత్రాలను చూపుతున్న పండితులు, కదిరి లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులు

కదిరి: 'ఖాద్రీశా... గోవిందా' నామస్మరణతో కదిరి మార్మోగింది. ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం స్వామివారి కల్యాణోత్సం కమనీయంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవితో పాటు లక్ష్మి నారసింహుడి ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం భక్తులందరికీ శ్రీవారి తలంబ్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీటీడీ నుంచి విచ్చేసిన అర్చక పండితులు శ్రీవారి కల్యాణోత్సవ విశిష్టతను వివరించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. కలెక్టర్ బసంత్‌కుమార్ దంపతులు కల్యాణోత్సవానికి ముందే స్వామివారిని దర్శించుకొని వెళ్లారు. ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి శేషాద్రి, కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, విశ్రాంత జడ్జి, టీటీడీ బోర్డు సలహాదారు రెడ్డెప్పరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ధ్వజారోహణం

నృసింహుని బ్రహ్మోత్సవాలను నలుదిక్కులా చాటేందుకు శుక్రవారం ఉదయం ఆలయం ముందున్న ధ్వజ స్తంభానికి అర్చకులు గరుడ దండాన్ని ధ్వజారోహణం చేశారు. సకల దేవతలకు ఇదే శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక..అని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. ధ్వజారోహనాన్ని ఈ ప్రాంతంలో 'కంకణాలు కట్టడం' అంటారు. ఈ కంకణాలు విప్పేవరకూ అంటే తీర్థవాది ముగిసే వరకూ నరసింహ స్వామి భక్తులెవ్వరూ మాంసాహారం ముట్టుకోరు..పెళ్ళిళ్లు కూడా చేయరు.

మే నాటికల్లా ఆర్వోబీ పనుల పూర్తి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- గడ్డర్ల ఏర్పాటు విజయవంతం

అనంతపురం క్రైం: అనంతపురంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు లేదా మే నాటికల్లా పూర్తవుతాయని, ఆ తర్వాత రాకపోకలను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బ్రిడ్జి దిమ్మెలపై గడ్డర్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. పనులు పకడ్బందీగా చేపట్టాలని రైల్వే, ఎన్‌హెచ్ అధికారులను, కాంట్రాక్టు సంస్థ (ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్) ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం రైల్వే ట్రాక్ వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించి..అధిక వర్షాలు వచ్చినా సమస్య తలెత్తకుండా పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. నడిమివంక బ్రిడ్జి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఎన్‌హెచ్– 42 అర్బన్ లింక్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఆర్వోబీ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. దాదాపు 55 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు తగ్గట్టు ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఐదు లక్షల జనాభా ఉందని, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రోజూ లక్ష మంది వరకు నగరానికి వస్తుంటారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే సింగిల్ బ్రిడ్జిని డబుల్ బ్రిడ్జిగా విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. బళ్లారి బైపాస్ నుంచి క్లాక్‌టవర్ ఓవర్ బ్రిడ్జి, సప్తగిరి సర్కిల్ మీదుగా పంగల్ రోడ్డు వరకు దాదాపు 9.1 కిలోమీటర్ల జాతీయ రహదారి పనులను ఈ ఏడాది జూలై కల్లా పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు ఉన్నారు.



బ్రిడ్జి దిమ్మెలపై గడ్డర్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గడ్డర్ల ఏర్పాటు షురూ..

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా గడ్డర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజు శుక్రవారం ఐదు గడ్డర్లు ఏర్పాటు చేశారు. శనివారం మరో ఐదింటిని ఏర్పాటు చేయనున్నారు. మధ్యాహ్నం 1.20 నుంచి 3.30 గంటల వరకు గడ్డర్ల ఏర్పాటుకు రైల్వే అధికారులు అనుమతిచ్చారు. ఆ సమయంలో ఈ మార్గాన వెళ్లే కుర్లా, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి ప్యాసింజర్ రైళ్లతో పాటు ఆరేడు గూడ్స్ రైళ్ల రాకపోకలను నిలిపేశారు. భారీ క్రేన్ సాయంతో బ్రిడ్జి దిమ్మెలపై గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో గడ్డర్ 30 టన్నుల బరువు ఉంటుందని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.



దిమ్మెలపై ఐదు గడ్డర్లను ఏర్పాటు చేసిన దృశ్యం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

సంతకాల సేకరణలో నిర్లక్ష్యం వీడండి

అనంతపురం సిటీ: సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన లబ్ధిదారుల సంతకాల సేకరణలో నిర్లక్ష్యం వీడాలని సంబంధిత ఉద్యోగులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి హెచ్చరించారు. డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్‌తో కలసి శుకవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లాలోని 3 మండలాలకు చెందిన ఎంపీడీఓలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడారు. సంక్షేమ ఫలాలు అందుకున్న లబ్ధిదారుల సంతకాల సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా వివరాలు రాబట్టారు. సంతకాల సేకరణలో వెనుకబడిన మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడితే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తుండడంతో వెంటనే వంద శాతం సంతకాల సేకరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

క్లుప్తంగా

శేష వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: స్థానిక శివలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలు అర్చకుడు హరికృష్ణ శర్మ, ఆలయ పాలక మండలి చైర్మన్ రామిరెడ్డి పర్యవేక్షించారు. పూజల్లో ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వెంకట్రాముడు, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 47 ప్యాకెట్ల (ఒక్కొక్కటి 50 కిలోలు) రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తుండగా శుక్రవారం సాయంత్రం పెద్దపేట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలిస్తున్న యాడికి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, శివకుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

లింగ వివక్షను రూపుమాపుదాం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

అనంతపురం సప్తగిరి సర్కిల్: లింగ వివక్షను రూపుమాపాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ప్రజలను చైతన్య పరుస్తూ శుక్రవారం ఉదయం డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుజాత, సిబ్బంది వేణుగోపాల్, కిరణ్‌కుమార్, ఆశారాణి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రానైట్ దందా..!

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- నిషేధిత వేళల్లో గ్రానైట్ తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని అధికారులు



మీరు చూస్తున్న ఈ రాయి వాస్తవ టన్నేజీతో కాకుండా తక్కువ టన్నేజీతో పర్మిట్ పొంది కర్ణాటకకు తరలిస్తున్నారు. గుమ్మఘట్ట మండలంలోని క్వారీల్లో వెలికి తీసిన బ్లాక్, వైట్ గ్రానైట్ రాళ్లను కొందరు నిషేధిత వేళలలో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కేపీదొడ్డి, గలగల, ఉదేం గ్రామాల మీదుగా సరిహద్దు దాటించేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.



రాయదుర్గం మండలం మల్లాపురం సమీపంలోని క్వారీ నుంచి భారీ టన్నేజీ గల తెల్ల రకం గ్రానైట్‌ను రోజూ రాత్రిళ్లు పట్టణ నడిబొడ్డు మీదుగా అనంతపురం వైపు తరలిస్తున్నారు. అధిక టన్నేజీతో వెళుతున్న లారీలను ఏ ఒక్క అధికారీ అడ్డుకోవడం లేదు.

... ఈ రెండు ప్రాంతాల్లోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా క్వారీల నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దర్జాగా సాగిపోతున్న ఈ చీకటి వ్యాపారానికి అధికారుల పూర్తి సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా రూ.కోట్లలో ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది.

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ ఇలా..

గ్రానైట్ పరిమాణం (సెం.మీ.)	రంగు	రాయల్టీ	వివిధ పన్నులతో చెల్లించాల్సిన మొత్తం రాయల్టీ
300 X180	బ్లాక్	రూ.3,450	రూ.5,744
	వైట్	రూ.2,700	రూ.4,495
270 X150	బ్లాక్	రూ.2,874	రూ.4,786
	వైట్	రూ.2,470	రూ.4,112
	బ్లాక్ మినీ	రూ.2,700	రూ.4,495
75 సెం.మీ లోపు	బ్లాక్	రూ.1,150	రూ.1,914
	వైట్	రూ.1,150	రూ.1,914

రాయదుర్గం: జిల్లాలో గ్రానైట్ మాఫియా కొనసాగుతోంది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని చీకటి వ్యాపారానికి తెరలేపింది. నిబంధనలు తుంగలో తొక్కి గ్రానైట్‌ను అక్రమంగా సరిహద్దులు దాటించేస్తున్నారు. ఒకే బిల్లుపై ఎక్కువ ట్రిప్పులు తరలిస్తూ రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ..

జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో బ్లాక్ కలర్ గ్రానైట్ క్వారీలు 20, వైట్ కలర్ గ్రానైట్ క్వారీలు 19 ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వెలికి తీసే గ్రానైట్‌కు ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. దీంతో క్వారీ నిర్వాహకులు కుమ్మక్కై అధికారులను గుప్పిట్లో పెట్టుకుని చాలా చోట్ల తక్కువ క్యూబిక్ మీటర్‌కు అనుమతులు పొంది ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. వెలికి తీసిన గ్రానైట్‌ను అక్రమంగా నిషేధిత వేళల్లో ఇతర రాష్ట్రాలకు తరలించి రూ. కోట్లు గడిస్తున్నారు.

పేలుళ్లతో బెంబేలు..

గ్రానైట్ వెలికి తీసేందుకు క్వారీ నిర్వాహకులు భారీగా పేలుడు సామగ్రి వినియోగిస్తున్నారు. దీంతో పేలుడు శబ్దాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నివాస గృహాలు బీటలు వారుతున్నాయి. కొన్ని క్వారీల్లో నిపుణులు లేకుండానే పేలుళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పేలుడు సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. ఇటీవల గుమ్మఘట్ట మండలం అడిగుప్ప వద్ద జిలెటిన్ స్టిక్స్‌కు సంబంధించిన భారీ మ్యాగజైన్ లభ్యం కావడం ఇందుకు నిదర్శనం.

నిబంధనలు తుంగలోకి..

క్వారీ నుంచి గ్రానైట్‌ను తరలించే ప్రతి లారీకి ఒక్కో దానికి ఒక్కో విధంగా రోడ్డు ట్యాక్స్ చెల్లించాలి. 10 టైర్ల ట్రక్కులో 25 టన్నులు, 12 టైర్ల ట్రక్కులో 31, 14 టైర్ల ట్రక్కులో 35, 18 టైర్ల ట్రక్కులో 41, 22 టైర్లకైతే 49 టన్నుల సామర్థ్యం కలిగిన గ్రానైట్‌ను తరలించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి రాయికి అధికారుల సమక్షంలో కొలతలు తీసి నంబర్లు వేయాలి. ఆ తర్వాత రాయల్టీ విధించిన రసీదుతో నిర్ణీత టన్నేజీతోనే తరలించాలి. అయితే ఈ నిబంధనలను క్వారీ నిర్వాహకులు తుంగలో తొక్కి అధిక టన్నేజీని తక్కువగా చూపిస్తూ అక్రమంగా సరిహద్దులు దాటించేసి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాక ఒకే బిల్లుపై రెండింతల రాయిని తరలిస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో భారీ వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి.

గ్రానైట్ క్వారీల వివరాలు..

నియోజకవర్గం	నలుపు రకం	తెల్లపు రకం
రాయదుర్గం	5	10
కళ్యాణదుర్గం	12	6
ఉరవకొండ	3	3

నంబర్లు లేకుండా తరలిస్తే చర్యలు

క్వారీ నిర్వాహకులే ఆన్‌లైన్‌లో పర్మిట్ల కోసం దరఖాస్తు చేస్తారు. తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి రాయి బ్లాక్ కొలతలు తీసి నంబర్లు వేసి పర్మిట్ జారీ చేస్తాం. నంబర్ ఉన్న రాయినే తరలించాలి. అలా కాదని మరో రాయిని తరలిస్తే కేసులు నమోదు చేసి, భారీగా జరిమానా విధిస్తాం. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, గనులశాఖ, ఏజీ అనంతపురం

రేపటి లోపు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులను శనివారం లోపు అందజేయాలని అధికారులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. అనంతపురంలోని రాజేంద్ర నగర పాలకోన్నత పాఠశాల, రాప్తాడులోని జెడ్పీహెచ్‌లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి వసతి, మౌలిక సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం కనబరచరాదన్నారు. ఓటరు స్లిప్పు తీసుకోకపోతే జాబితాలో ఏ కారణం చేత తీసుకోలేదనే వివరణ నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, అనంతపురం తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, రాప్తాడు ఇన్‌చార్జి తహసీల్దారు నరసింహులు, డీటీ దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ఆరా తీస్తున్న నాగలక్ష్మి

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాప్తాడు: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఎన్నికల అధికారి హోదాలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు.పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు 'ఏ' గ్రేడులోకి చేరుకునేలా చొరవ తీసుకోవాలని హెచ్ఎం నరసింహులును ఆదేశించారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీ శుక్రవారం స్థానిక అనంత క్రీడా మైదానంలో ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన హాకీ జట్లు పాల్గొన్నాయి. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, పీటీసీ సీఐ పవన్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. టోర్నీ విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తున్న ఆర్డీటీ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్యరాజు, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, ట్రెజరర్ థామస్ పీటర్, కర్నూలు సెక్రటరీ సుదీర్, హాకీ అనంతపురం జిల్లా కన్వీనర్ అనిల్‌రాజ్‌కుమార్, మాణిక్యరాజ్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు ఎన్టీఆర్ జిల్లా జట్టుపై 12–0 గోల్స్ తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు విజయం సాధించింది. అలాగే 4–0 గోల్స్ తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై శ్రీసత్యసాయి జిల్లా జట్టు, 4–0 గోల్స్ తేడాలో ఎన్టీఆర్ జిల్లా జట్టుపై తిరుపతి జిల్లా జట్టు, 5–0 గోల్స్ తేడాతో నంద్యాలపై విశాఖ జట్టు, 4–0 గోల్స్ తేడాతో కర్నూలుపై అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించాయి.



మ్యాచ్‌లో తలపడుతున్న అనంతపురం-కర్నూలు జిల్లా జట్లు

గొర్రెల మందపై చిరుత దాడి

కళ్యాణదుర్గం: మండలంలోని కామక్కపల్లి రిజర్వు ఫారెస్ట్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన కాపరి రామ్మోహన్ అటవీ ప్రాంతంలో తన గొర్రెల మందను మేపు కోసం తోలుకెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మందలో చివరగా వస్తున్న గొర్రెలపై వెనుక నుంచి చిరుత దాడి చేయడంతో అప్రమత్తమైన కాపరులు వెంటనే కేకలు వేసి చిరుతను బెదరగొట్టారు. దీంతో గొర్రెను వదిలేసి చిరుత పారిపోయింది. చిరుత దాడిలో ఓ గొర్రె స్వల్పంగా గాయపడింది.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

కళ్యాణదుర్గం: పట్టణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బళ్లారి మిట్టపై ఉన్న మనోహర్ ప్లాజాలో పక్కపక్కనే ఉన్న మెడికల్ స్టోర్, మిల్క్ డెయిరీషట్టర్లను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. మెడికల్ స్టోర్‌లో రూ.9,500, డెయిరీలో రూ.7,500 నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు చాకలి వన్నూరుస్వామి, సురేష్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రికార్డు స్థాయిలో మొబైల్ ఫోన్ల రికవరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చాట్‌బాట్ సేవల్లో అనంత పోలీసులు రికార్డు సృష్టిస్తున్నారు. గురువారం ఒక్క రోజే రూ. 8.14 లక్షల విలువ చేసే 55 సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప మెప్పు పొందారు. ఇందులో అనంతపురం జిల్లాకు చెందినవి 41, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 7, కర్నూలు 4, గుంటూరు, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు సంబంధించి ఒక్కొక్కటి ఉన్నాయి.

యువతి బలవన్మరణం

ఉరవకొండ రూరల్: అనారోగ్య పరిస్థితులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం షేక్షానుపల్లికి చెందిన బోయ చిన్నప్పయ్య, బాలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్న కుమార్తె రేణుక (18) అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రేణుక... గురువారంసాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను కాపాడి 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించిక శుక్రవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ - తండ్రి, కుమార్తెకు గాయాలు

రాయదుర్గం: స్థానిక శాంతినగర్‌లో ప్రమాదవశాత్తు శుక్రవారం ఉదయం వంట గ్యాస్ సిలిండర్ లీకైన ఘటనలో తండ్రి శ్రీనివాసులు, కుమార్తె దీక్షిత గాయపడ్డారు. దీక్షిత వంట గదిలోకి దోమల బ్యాట్‌తో శుభ్రం చేస్తుండగా సిలిండర్ పైప్‌కు తగిలి ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో తండ్రి అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశాడు. ఆ సమయంలో తండ్రి, కుమార్తె చేతులకు కాలిన గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై వెంటనే ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మంజునాథ్ మృతదేహం

గుత్తి: స్థానిక రైల్వే ఉద్యోగి కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌లోని హోరబ్ చర్చి ప్రాంతానికి చెందిన లోకో పైలెట్ ఆదినారాయణ కుమారుడు మంజునాథ్ (25) గురువారం రాత్రి 9 గంటలకు ఎస్ఎస్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రి ఆర్ఎస్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వెనుక అపస్మారకంగా పడి ఉండడం గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, స్నేహితులతో కలసి మంజునాథ్ ఫుల్‌గా మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. అయితే తన కుమారుడిని ఆర్ఎస్‌కు చెందిన దాదు, రేష్మి హతమార్చి ఉంటారని తండ్రి ఆదినారాయణ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పూర్తయిన బిందు సేద్యం లక్ష్యం

- గడువు లోపు 11 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు
- ఏపీఎంఐపీ జిల్లా అధికారి జి.ఫిరోజ్‌ఖాన్ వెల్లడి

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2022–23 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 11 వేల హెక్టార్లకు రాయితీతో బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) సేద్యం పరికరాల ఏర్పాటు లక్ష్యం పూర్తి చేసినట్లు ఏపీఎంఐపీ జిల్లా అధికారి జి.ఫిరోజ్‌ఖాన్ శుక్రవారం వెల్లడించారు. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచనల మేరకు సకాలంలో రైతులకు ఉపయోగపడేలా యూనిట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పరికరాలకు రిజిస్ట్రేషన్లు, మంజూరు, ఇన్‌స్టాలేషన్‌లో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. 26,202 మంది రైతులు 35,370 హెక్టార్ల డ్రిప్‌కు, మరో 3,338 మంది రైతులు 4,098 హెక్టార్లకు స్ప్రింక్లర్లు కావాలని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తు చేశారు. వీరిలో 7,132 మంది రైతులకు రాయితీతో 8,885 హెక్టార్లకు డ్రిప్ యూనిట్లు, 1,784 మంది రైతులకు 2,117 హెక్టార్లకు స్ప్రింక్లర్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ రాకముందే రిజిస్ట్రేషన్లు చేసుకుని, రైతు వాటా సొమ్ము చెల్లించిన వారికి యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

జేసీకి ఓటేస్తే తలకు కొరివిపెట్టుకున్నట్లే

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



కొట్టాలపల్లి బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: జేసీ ప్రభాకరరెడ్డికి ఓటేస్తే తలకు కొరివి పెట్టుకున్నట్లవుతుందని, ఈ విషయం తనకంటే ఓటర్లకే బాగా తెలుసునని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. పెద్దపప్పూరు మండలంలో ప్రజా సంక్షేమ పాదయాత్రలో భాగంగా నాల్గో రోజు శుక్రవారం ఆయన పెండేకల్లు నుంచి కుమ్మెత, సుంకేసులపల్లి మీదుగా అత్తిరాలదిన్నెకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కొట్టాలపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు గెలవకపోతాడా అనే ఆశ ఇంకా కొందరిలో ఉందని, ఈ క్రమంలోనే జేసీకి ఓటేసి ఎక్కడ నెత్తికి కొరివి పెట్టుకోవాల్సి వస్తోందోనన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న జేసీ ప్రభాకరరెడ్డి వద్దకు గ్రామస్తులు వెళితే వారిని హీనంగా చూసిన తీరును నేటికీ ఎవరూ మరువలేదన్నారు. జేసీ సోదరుల 30 ఏళ్ల పాలనలో ఏ గ్రామంలో చూసినా వర్గకక్షలు ఉండేవన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి కుటుంబమూ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిందేనని గుర్తు చేశారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత వర్గ కక్షలు లేకుండా ప్రతి గ్రామంలోనూ ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. జేసీ ప్రభాకరరెడ్డిని నియోజకవర్గ ప్రజలు నమ్మడం లేదన్నారు. దీంతో ఆయనలో భయం మొదలై తనకు వ్యతిరేకంగా చీకటి పడిన తర్వాత గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాడిపత్రి నియోజకవర్గంలో జేసీకి రాజకీయ భవిష్యత్తు లేదని, భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిదే గెలుపు అవుతుందని అన్నారు.

బ్యాలెట్ పేపర్లు వచ్చేశాయి..

- జిల్లాల వారీగా పంపిణీకి చర్యలు చేపట్టిన సిబ్బంది

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు వేగవంతం చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు అనంతపురం జిల్లా కేంద్రానికి శుక్రవారం చేరుకున్నాయి. వీటిని అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా విభజించి ప్యాక్ చేస్తున్నారు. కాగా, కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో చేపట్టిన ఈ పనులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. మరో మూడు, నాలుగు రోజుల్లోపు పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు జిల్లాకు రానున్నాయని, వీటిని కూడా విభజించి, ప్యాక్ చేసిన తర్వాత 11వ తేదీలోపు ఆయా జిల్లాలకు చేరవేయనున్నట్లు పేర్కొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

వికటించిన చిరుతిండి

- మూంగ్ దాల్ తిని 23 మంది విద్యార్థులకు అస్వస్థత
- శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఘటన

సాక్షి, పుట్టపర్తి: పాఠశాలలో పంపిణీ చేసిన చిరుతిండి వికటించడంతో 23 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లిలోని వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చిరుతిండి (మూంగ్ దాల్) తినడంతోనే వారంతా అస్వస్థతకు గురైనట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. వివరాల్లోకి వెళితే...వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 310 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఐదో తరగతిలో గదిలోని 23 మంది విద్యార్థులుండగా, ఉపాధ్యాయురాలు బోధన చేస్తోంది. ఈ సమయంలోనే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయురాలికి కళ్లు తిరగడం, వాంతులు కావడం, కడుపు నొప్పి రావడం తదితర లక్షణాలు కనిపించాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. పక్కనే ఉన్న ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



ఎనుములపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మెరుగైన వైద్యం కోసం..

ఎనుములపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం 14 మంది మధ్యాహ్నం 2.30 గంటలకు డిశ్చార్జ్ కాగా, మరో ముగ్గురు అక్కడే చికిత్స పొందుతున్నారు. మిగిగిన ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే విద్య, వైద్య, ఆహార భద్రత, కాలుష్య నియంత్రణ అధికారులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా రెవెన్యూ, పోలీసు అధికారులు పాఠశాల నిర్వాహకులతో మాట్లాడారు.

అనుమానాలు ఎన్నో..

- వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో తాగునీరు కలుషితమైనట్లు తెలుస్తోంది. అందువల్లే ఘటన జరిగిన కాసేపటికే నిర్వాహకులు నీళ్ల ట్యాంకులు మార్చారు. నీటి సంపు శుభ్రం చేయించారు. తరగతి గదులన్నీ ఫినాయిల్‌తో కడిగించారు.
- మూంగ్ దాల్ కేవలం ఐదో తరగతి విద్యార్థులు మాత్రమే తీసుకోగా.. పాఠశాల మొత్తం పంపిణీ చేశామని నిర్వాహకులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చే సమయానికి మూంగ్ దాల్ కవర్లు పడేశారు.
- చెడు వాసన పీల్చడంతో తరగతి గదిలో విద్యార్థులు ఇబ్బందులు పడినట్లు నిర్వాహకులు చెబుతున్నా చెడు వాసన వస్తే పాఠశాల మొత్తం వ్యాపించాలని గానీ, ఐదో తరగతి గదిలోకి మాత్రమే ఎలా వస్తుందన్న అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ అధికారులు పాఠశాల మొత్తం కలియతిరిగి ఎలాంటి కాలుష్యం లేదని స్పష్టం చేశారు.
- ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆలస్యంగా వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను అడిగి సమాచారం తెలుసుకున్నారు.

క్లుప్తంగా

అర్థం చేసుకుంటే ఇంగ్లిష్ ఈజీ



విద్యార్థులకు ఇంగ్లిష్ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: చాలా మంది ఇంగ్లిష్ అంటేనే భయపడిపోతుంటారని, కానీ అర్థం చేసుకోగలిగితే ఇంగ్లిష్ అంత ఈజీ లాంగ్వేజ్ మరొకటి ఉండదని సనప ఉన్నత పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని సనప ఉన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌కేసీ సేవా సమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కమల్‌నాథ్, హెచ్ఎం రామాంజనేయులు.. నిత్య జీవితంలో ఇంగ్లిష్ ప్రాధాన్యం వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. అనంతరం పాఠశాలకు ఫౌండేషన్ తరఫున మైక్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉదయ్, నాగేంద్ర, గోపిక , పూర్ణిమ, ఉపాధ్యాయులు లలిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

‘లేపాక్షి’ అమ్మకాలపై డిస్కౌంట్

అనంతపురం కల్చరల్: హస్త కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వ సూచనల మేరకు లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్‌తో అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం లేపాక్షి ఎంపోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ప్రత్యేకంగా ఎంపిక చేసిన హస్తకళా ఉత్పత్తులపై 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా గృహోపకరణాలు, కానుకల కోసం అందించే వాటిని హస్తకళాకారులు ఎంతో నైపుణ్యంతో చేశారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాన నీటిపై అవగాహన కల్పిద్దాం



బహుమతినందుకుంటున్న యువతి

అనంతపురం కల్చరల్: వాన నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికి యువత సిద్ధంగా ఉండాలని నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకే) జిల్లా అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర సమావేశ మందిరంలో ‘క్యాచ్ ది రెయిన్’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌వైకే జిల్లా ఇన్‌చార్జ్ మణికంఠ మాట్లాడుతూ హార్వెస్టింగ్ పద్ధతి, నీటి కుంటల్లో పూడిక తీయడం, మొక్కలు పెంచడం, చెక్‌డ్యాములు నిర్మించడం, ఇంకుడు గుంతలు తీయడం లాంటి వాటి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని యువతకు సూచించారు. డీడీఓ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, భరత్, జయమారుతి తదితరులు మాట్లాడారు. వాన నీటి ఆవశ్యత అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులందించారు. అనంతరం వాన నీటి నిల్వపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వలంటీర్ల చేత ప్రమాణం చేయించారు.

వివేకానందనగర్‌లో చోరీ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట శివారులోని ద్వారకా విల్లాస్ ఎదురుగా వివేకానందనగర్‌లో రెండు రోజుల కిందట చోరీ జరిగింది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. వివేకానందనగర్‌లో వసంతకుమార్, స్వప్నరాణి దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అనంతరం దుండగులు తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా పగులగొట్టి 4.5 తులాల బంగారాన్ని అపహరించి, వెనుక డోర్ నుంచి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన స్వప్నరాణి.. దొంగతనం జరిగిందని గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు వేలంపాట

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో శనివారం ఉదయం 11 గంటలకు సంత మార్కెట్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఇప్పటికే వేలంపాటను పలుమార్లు వాయిదా వేసిన విషయం విదితమే. ఇప్పుడు జరిగే వేలంపాటలోనైనా సంత మార్కెట్ కేటాయింపు జరుగుతుందో లేదో వేచి చూడాలి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు

కనగానపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల రబీ పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సరఫరా మెరుగుపరిచి పంటలను కాపాడాలని సీపీఐ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులతో కలసి శుక్రవారం జిల్లా రైతు సంఘం ఉప కార్యదర్శి మహదేవ్ స్థానిక సబ్‌స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఓటు అంకెలో వేయాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును అంకెల్లో వేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై నగరంలోని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శుక్రవారం మునిసిపల్ ఆర్డీ కార్యాలయం, నగరపాలక సంస్థ, కస్తూరిబా, రాజేంద్ర నగరపాలక పాఠశాలల్లో కమిషనర్ భాగ్యలక్ష్మి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రాధాన్యత ఓటు ఏవిధంగా నమోదు చేయాలో స్పష్టంగా వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, ఎన్నికల సంఘం నిర్ణయించే గుర్తింపు కార్డులు, తదితర వాటిపై విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, వార్డు కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఓటు వేయాలి

రాప్తాడురూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటు వేయాలని అనంతపురం ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, ఎంఈఓ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పట్టభద్రులకు ఓటింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ విధానంలో పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు ఉండవన్నారు. పేరు మాత్రమే ఉంటుందని, ఆ పేరుకు ఎదురు బాక్స్‌లో ప్రాధాన్యత అంకె (1, 2, 3, 4... తదితర) వేయాల్సి ఉంటుందన్నారు. 1 నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని, తర్వాత 2, 3, 4 ప్రాధాన్యత నంబరును నచ్చిన వారికి వేసుకోవచ్చన్నారు. 1వ నంబర్ వెయ్యకపోతే ఆ ఓటు చెల్లదన్నారు. అధికారి ఇచ్చే కలర్ స్కెచ్ పెన్నుతో మాత్రమే ఓటు నంబర్ వేయాలన్నారు. పోలింగ్‌కేంద్రంలోకి సెల్‌ఫోన్, కెమెరా, డిజిటల్ పెన్ కానీ అనుమతించరన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ అలివేలమ్మ, ఏఎస్ఓ కళ్యాణి పాల్గొన్నారు.

అవగాహన అవసరం

రాప్తాడు: ఓటు వినియోగంపై పట్టభద్రులు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ముందుగా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలి...ఎలా వేయకూడదన్న దానిపై సూచనలు తెలిపే బోర్డును కార్యాలయం ముందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ మాధవీలత, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ఆత్మకూరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, అందువల్ల ప్రతి ఓటరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంఈఓ నరసింహారెడ్డి, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా ఓటు వేస్తే చెల్లుబాటు అవుతుందో అవగాహన కల్పించారు. 13వ తేదీన ఓటింగ్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

సజావుగా బడ్జెట్ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో మేయర్ వసీం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశం సజావుగా జరిగింది. ఈ ఏడాది (2023–24) బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.89.73 కోట్లుగా అంచనాల్లో పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలను పాలకవర్గం సభ్యులకు చదివి విన్పించారు.

టౌన్ ప్లానింగ్ దందాను ఆపండి

బడ్జెట్ చదివిన తర్వాత పాలకవర్గంలోని కొందరు సభ్యులు.. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల దందాకు అడ్డుకట్ట వేయాలని కమిషనర్‌కు విన్నవించారు. నగరంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది నిబద్ధతతో పని చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ ఇస్సాక్ తదితరులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

- బడ్జెట్‌లో రాబడులు, ఖర్చులతో పాటు చేసిన ఖర్చులను చూయించాలని కోగటం డిమాండ్ చేశారు. ఎల్ఈడీ లైట్ల నిర్వహణకు రూ.కోట్లు కేటాయించడం సరికాదని, దానిపై స్పష్టత ఉండాలని సభ్యులు పేర్కొన్నారు.
- పశు సంరక్షణకు అధిక బడ్జెట్ పెంచాలని, నగర పాలక సంస్థ పరిధిలో గోశాల, కుక్కల బెడద నివారణకు ప్రణాళిక సిద్ధం చేయాలని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య విజ్ఞప్తి చేశారు.
- బడ్జెట్‌పై చర్చకంటే ముందు తదుపరి కౌన్సిల్ సమావేశం ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాక ముందుకెళ్దామని కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ డిమాండ్ చేశారు. దీంతో కమిషనర్ కే భాగ్యలక్ష్మి ఈ నెల 27న కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కడప జిల్లాలో వినియోగించిన క్లాప్ ఆటోలను ఇక్కడకు ఏవిధంగా తీసుకు వచ్చారని కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ కమిషనర్‌ను ప్రశ్నించారు.
- జేసీబీలు, మినీ జేసీబీల నిర్వహణ సరిగా లేదని కార్పొరేటర్ అబూసాలేహా అసంతృప్తి వ్యక్తం చేశారు. క్లాప్ కార్యక్రమానికి సంబంధించి ఆటోలకు సిబ్బందిని ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులను సూచించాలన్నారు.
- నగరంలో కుక్కల బెడద అధికంగా ఉందని పలువురు సభ్యులు తెలపగా.. త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుమతి, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాబడి రూ.94.99 కోట్లు

నగరపాలక సంస్థకు రాబడి రూ.94.99 కోట్లుగా చూయించారు. ఆదాయ రాబడుల్లో రూ.6 కోట్లు బిల్డింగ్ లైసెన్స్ ఫీజులు, రూ.కోటి బీపీఎస్ అప్లికేషన్ ఫీజు, రూ.35 కోట్లు షాపు రూం బాడుగలు, ఆస్తి పన్ను రూ.35 కోట్లు, నీటి పన్ను రూ.7 కోట్లు, ఖాళీ జాగా పన్నులు రూ.4 కోట్లు, ఇంటి పన్ను అపరాధ రుసుం రూ.4 కోట్లు, ఆస్తి పన్ను మార్పిడి ఫీజులు రూ.1.25 కోట్లు, స్టాంపు డ్యూటీ చార్జీలు రూ.9 కోట్లుగా పేర్కొన్నారు.

‘వెన్నపూస’ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం



వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున కనగానపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రచారం చేస్తున్న మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరిత

కనగానపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, ప్రభాకర్, రమణారెడ్డి, తదితరులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఓటర్లను కలసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించి, పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపన్న. అంకె అశోక్, నవీన్, సర్పంచ్ దాసిరెడ్డి, రామకృష్ణ, అమరనాథరెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

అనంతపురం క్రైం: నగరంలోని 29వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ అనుబంధ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సతీమణి హరిత శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల బ్యాలెట్‌లో వరుస నంబర్ మూడులో పేరుకు ఎదురుగా ఉన్న గడిలో ఎన్నికల అధికారులిచ్చిన పెన్నుతో 1 అంకె నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జావేద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించండి



ఎస్పీ ఫక్కీరప్పకు బొకే అందజేస్తున్న కానిస్టేబుళ్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఫక్కీరప్ప కానిస్టేబుళ్లకు సూచించారు. ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన ముగ్గురు కానిస్టేబుళ్లు శుక్రవారం ఎస్పీని చాంబర్‌లో కలిసి, పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు వెంకటరాముడు, మనోహర్, పూజారి మనోహర్ పాల్గొన్నారు.

విజయ్‌సాయికి సేవారత్న అవార్డు



జీయర్ స్వామీజీల చేతుల మీదుగా పురస్కారాన్నందుకుంటున్న విజయ్‌సాయి

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు నిర్వాహకుడు విజయ్‌సాయికి ఆధ్యాత్మిక సేవా రత్న అవార్డు లభించింది. శుక్రవారం కర్నూలులోని గోదాగోకులంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ స్వామీజీ, మేల్కోట్ శఠగోప రామానుజ జీయర్, శ్రీదేవనాథ రామాజనుజ జీయర్ స్వామీజీల చేతుల మీదుగా సత్కారమందుకున్నారు. పరమాత్మానంద గిరిస్వామీజీ, లక్ష్మీనారాయణ తదితరులు సాయిట్రస్టు చేస్తున్న సేవలను ప్రశంసించారు.

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్రైం: హజ్ యాత్రకు ఈ నెల పదో తేదీ వరకు గడువు ఉన్నందున ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే వారు ఉచితంగా దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా హజ్ సొసైటీల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు ప్రింట్ కాపీతో పాటు పాస్‌పోర్టు మొదటి, చివరి పేజీలు, ఆధార్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, నాలుగు క్యాన్సిల్డ్ బ్యాంక్ చెక్కులు, అడ్వాన్స్ ఫీజు రసీదు, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఏపీ హజ్ సొసైటీ కార్యాలయంలో అందజేయాలన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారు ఆన్‌లైన్‌లోనూ (http:hajcommitttee.gov.in apstatehajcommittee.com) నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

సమగ్ర విచారణకు డిమాండ్



రెక్టార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం: ఇటీవల విడుదలైన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 10,288 మంది విద్యార్థులు నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని, వీరందరికీ రీవాల్యుయేషన్‌ను ఉచితంగా నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఎస్కేయూ క్యాంపస్‌లో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రయాదవ్ మాట్లాడుతూ జవాబుపత్రాల మూల్యాంకనంలో ఎగ్జామినర్ల తప్పిదాల కారణంగా సింహభాగం విద్యార్థులు ఫెయిలయ్యారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉచితంగా రీవాల్యుయేషన్ చేయించాలని కోరారు. అనంతరం రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జున రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ కుమార్, సంజీవ్ కుమార్, సందీప్ రెడ్డి, ఆష్రాఫ్ వలి, అనిల్, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా మూల్యాంకనం

మూల్యాంకనం తప్పులతడకగా నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, జిల్లా కార్యదర్శి రాజునాయక్ విమర్శించారు. ఎస్కేయూ క్యాంపస్‌లో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో నాయకులు రవికుమార్, వంశీకృష్ణ, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు శుక్రవారం అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథులు శాప్ డైరెక్టర్ ఓబిరెడ్డి, జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ మాట్లాడుతూ క్రీడాకారులకు యుద్ధకళలు చాలా అవసరమన్నారు. భారత కీర్తిని చాటి చెప్పే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టోర్నీలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 12 వరకు విశాఖ జిల్లా యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో రాయలసీమ ఇన్‌చార్జ్ నాయబ్ రసూల్, సీనియర్ శిక్షకులు శాంతరాజ్, కోచ్‌లు శ్రీకాంత్, రాజేష్, సాయిబాబా, సాయితేజ, షెక్షావలి, యోగానంద, సురేంద్ర, నాగేంద్ర, ప్రదీప్ రెడ్డి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి



రాప్తాడు: ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రాప్తాడు: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ నేతలు శుక్రవారం స్థానిక బస్టాండు సర్కిల్లో ఖాళీ సిలిండర్లతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువు నాయకులు మాట్లాడుతూ... కేంద్రం అన్ని ధరలు పెంచుతూ సామాన్యులపై పెనుభారాలను మోపుతోందన్నారు. 2014లో రూ.475 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,155కు చేరుకుందన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతున్నాయని, కొత్తగా గ్యాస్ ధర కూడా పెంచడం వల్ల సామాన్యుల జీవనం దుర్భరంగా మారుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ సర్కారును గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, రూరల్, రాప్తాడు మండల కార్యదర్శులు రమేష్, రవీంద్ర, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఖాద్రీశుని గ్రామోత్సవం



ఖాద్రీశుని పల్లకీ ఉత్సవ దృశ్యం

అనంతపురం: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల తరహాలో అనంతపురం మండలం రుద్రంపేట పంచాయతీలోని సీవీఆర్ నగర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం శ్రీలక్ష్మీ సమేత నారసింహుడు పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు చవ్వా నారాయణరెడ్డి, కరణం హరికృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, చిదంబరయ్య, నాగేశ్వరరెడ్డి, వేదపండితులు అనంత శర్మ తదితరులు మాట్లాడుతూ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏ విధంగా జరుగుతుందో ఇక్కడే వేడుకలు అలాగే నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

‘కాటమరెడ్డి’ కుటుంబ సేవలు మరువలేనివి



విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు అందజేస్తున్న రమణారెడ్డి కుటుంబీకులు, ఉపాధ్యాయులు

కనగానపల్లి: విద్యాభివృద్ధి కోసం కాటమరెడ్డి రమణారెడ్డి కుటుంబ సభ్యులు చేసిన సేవలను మరువలేనివని మామిళ్లపల్లి కేఆర్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం స్నేహలత తెలిపారు. శుక్రవారం పాఠశాల మూలధనం (కార్పస్ ఫండ్) దాత కాటమరెడ్డి రమణారెడ్డి వర్ధంతిని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి కుటుంబ సభ్యులు విద్యార్థులకు పెన్నులు, స్టేషనరీతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధి నిధి కోసం రమణారెడ్డి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. దీంతో ప్రభుత్వం ఈ పాఠశాలకు కాటమరెడ్డి రమణారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలగా నామకరణ చేసిందన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి తల్లి కేశమ్మ, సోదరుడు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేంద్రరెడ్డి, నాగరాజు, ఎస్వీ శివారెడ్డి, రామచంద్ర, జయచంద్ర, పీడీ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభం



అలంకరణలో తాతార్యారూఢ స్వామి

గార్లదిన్నె: మర్తాడులో శుక్రవారం తాతార్యారూఢ స్వామి తిరునాల శుక్రవారం ప్రారంభమైంది.ఉదయం 6గంటలకు ధ్వజారోహణము, మహా న్యాసపూర్వక రుద్రాభిషేకము నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కు లు తీర్చుకున్నారు. శనివారం సూర్యోదయాత్పూర్వం, గంగపూజ, కలశ స్థాపన రుద్రయజ్ఞం, రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



తలుపూరు వద్ద పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్న ఏఈఓ సుజిత

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి రత్నాకర్, మండల వ్యవసాయాధికారిణి సుజిత తెలిపారు. శుక్రవారం వారు సిబ్బందితో కలిసి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం మండలంలో 500 హెక్టార్లకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని లక్ష్యం విధించిందన్నారు. ఇప్పటి వరకు 342 మంది రైతులకు సంభందించిన 471 హెక్టార్లకు అనుమతులు వచ్చినట్లు తెలిపారు. అందులో ఇప్పటికే 296 మంది రైతులకు సంబంధించిన 407 హెక్టార్లలో మెటీరియల్ అందచేసినట్లు వెల్లడించారు.

డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు అందించిన స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలకు పరిశీలించారు.

తలుపూరులో పంటకోత ప్రయోగాలు

మండలంలోని తలుపూరు పొలాల్లో ఏఈఓ సుజిత రబీలో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట కోత ప్రయోగాలను చేశారు. దిగుబడిపై ఉన్నత అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేష్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ సుమనజయంతి

నార్పల: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సుమనజయంతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు సచివాలయాలను, చెత్త నుంచి సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సేంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రతి సమస్యను వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

IV

సాక్షి ఫ్యామిలీ

అనంతపురం

శనివారం ॥ 4-3-2023



● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం.

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్‌ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్ప జెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి


కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, గౌరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



- మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి.
- ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి.
- మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి.
- మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి.
- హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.

"ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

"నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

ఎనిమిదిళ్లు మారాను!

మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు, 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.



– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది" అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి